13 నుండి విశాలాంధ్ర పుస్తక ప్రదర్శన

పోస్టర్‌ను ఆవిష్కరించిన జీవీఎంసీ కమిషనర్



విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖ నగరంలో పుస్తక ప్రియులకు పండగ వచ్చేసింది. ఈ నెల 13వ తేదీ నుంచి డిసెంబర్ 5 వరకు విశాఖ టర్నర్ చౌల్ట్రిలో విశాలాంధ్ర 21వ పుస్తక ప్రదర్శన ప్రారంభం కానుంది. పుస్తక ప్రదర్శన పోస్టర్‌ను శుక్రవారం జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ పివిఎన్ మాధవ్, సిపిఐ జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ ఏజే స్టాలిన్, విశాలాంధ్ర బ్యూరో చీఫ్ రిపోర్టర్ పి.రామకృష్ణ, విశాలాంధ్ర విశాఖ బుక్ హౌస్ మేనేజర్ పీఏ రాజు, అరసం రాష్ట్ర కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, ప్రముఖ గాయకుడు, అభ్యుదయ వాది మజ్జి దేవిశ్రీ, విశాలాంధ్ర బుక్ హౌస్ నిర్వాహకులు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మ్యూజియం వాణిజ్య సముదాయంలో బినామీల రాజ్యం

విశాలాంధ్ర - అరకులోయ: ప్రముఖ పర్యాటక కేంద్రమైన ఆంధ్ర ఊటీ అందాల అరకులోయ పట్టణంలో గిరిజన సాంస్కృతిక మ్యూజియం ఎదుట పాడేరు ఐటీడీఏ నిర్మాణం చేపట్టిన గిరిజన వాణిజ్య భవన సముదాయంలో బినామీలు రాజ్యమేలుతున్నారు. గిరిజన నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలన్న సంకల్పంతో పాడేరు ఐటీడీఏ మ్యూజియం వద్ద 52 దుకాణాలను నిర్మించింది. ఈ దుకాణాల కేటాయింపునకు గిరిజన నిరుద్యోగుల నుండి దరఖాస్తులు స్వీకరించింది. ఎక్కువగా దరఖాస్తులు రావడంతో ఐటీడీఏ పీవో లాటరీ పద్ధతిలో గిరిజన నిరుద్యోగులకు దుకాణాలు కేటాయించారు. మొదటిలో ఒక్కో దుకాణానికి లక్ష రూపాయలు అడ్వాన్సుగా, పదివేల రూపాయలు నెలకు అద్దెగా నిర్ణయించారు. దీనిపై గిరిజన నిరుద్యోగుల నుండి సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమైంది. అయినప్పటికీ కొంతమంది గిరిజన నిరుద్యోగులు

తమకు కేటాయించిన దుకాణాలను తాము నిర్వహించకుండా వేరే వారికి అప్పగించడం జరిగింది. వాస్తవానికి పాడేరు ఐటీడీఏ నిబంధనల ప్రకారం గిరిజన నిరుద్యోగులే దుకాణాలు నిర్వహించుకోవాలి. అయితే అలాకాకుండా కొంతమంది ఐటీడీఏ లక్ష్యాన్ని నీరు గారుస్తూ అధికారుల సంకల్పానికి గండి కొడుతూ తమకు కేటాయించిన దుకాణాలను బినామీలకు అప్పగించి అధిక మొత్తంలో అడ్వాన్స్‌లు ప్రతినెల ఎక్కువ స్థాయిలో అద్దెలు పొందుతున్నారు. గతంలో షాపులు కేటాయించినప్పుడు ఐటీడీఏ పీఓ రోణంకి గోపాలకృష్ణ కొన్ని నిబంధనలు విధించారు. షాపులు దక్కించుకున్న నిరుద్యోగులు వారే షాపులు నిర్వహించుకోవాలని, చేతులు మారితే షాపులు సీజ్ చేయక తప్పదని హెచ్చరించడం కూడా జరిగింది.

అయితే ఆ హెచ్చరికలను పెడచెవిన పెడుతున్నారు. బినామీలకు షాపులు అప్ప గించే బదులు ఉద్యోగాలు లేక నిరుద్యోగంతో ఉన్న గిరి నిరుద్యోగులకు దుకాణాలు కేటాయిస్తూ వారు సొంతంగా వ్యాపారాలు నిర్వహిస్తూ కుటుంబాలను పోషించుకుంటారు కదా అనే చర్చ విస్తృతంగా ఇక్కడ జరుగుతుంది. ఇప్పటికైనా అధికారులు సమగ్ర విచారణ జరిపించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నేతలు, పలు రాజకీయ పక్షాల ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.

వాడివేడిగా జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం

స్టీల్‌ప్లాంట్‌పై తీర్మానం చేయాలి
కోడి వ్యర్థాలపై రభస
బీజేపీ సభ్యురాలు సస్పెన్షన్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ప్రధాని మోడీ విశాఖ విచ్చేస్తున్న నేపథ్యంలో విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలన్న అంశంపైమేయర్ ఆధ్వర్యంలో ప్రధానికి విజ్ఞప్తి చేయాలని సీపీఐ, సీపీఎం నాయకులు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ రంగంలోనే కొనసాగించేలా ప్రధాని మోడీతో చెప్పించాలని డిమాండ్ చేశారు. సీపీఐ కార్పొరేటర్ స్టాలిన్ స్టీల్‌ప్లాంట్ గొప్పతనాన్ని వివరించారు. శుక్రవారం విశాఖలో నిర్వహించిన జీవీఎంసీ కౌన్సిల్‌లో ప్రతిపక్షాలు నినదించాయి. ప్లాంట్‌ను కాపాడుకుందామని అందరూ పట్టుబడుతున్న నేపథ్యంలో బీజేపీ శాసన మండలి సభ్యులు మాట్లాడారు. దేశ వ్యాప్తంగా నష్టాల్లో ఉన్న బ్యాంకుల్ని విలీనం చేసి ప్రధాని మోదీ చరిత్ర సృష్టించారని, స్టీల్‌ప్లాంట్ విషయంలో కూడా పలుమార్లు ఆదుకున్నది బీజేపీయేనని చెపుకొచ్చారు. దీంతో విపక్షాల సభ్యులు అడ్డు తగిలారు. తక్షణమే ప్రధాని స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని టీడీపీ, జనసేన, సీపీఐ, సీపీఎం సహా అధికార పార్టీలోని కొంతమంది సభ్యులు కూడా మాట్లాడారు. అదే సమయంలో మాధవ్‌ను చుట్టు ముట్టారు. కోడి వ్యర్థాల టెండర్లకు సంబంధించి జీవీఎం సీకి నష్టం కలుగుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని కార్పొరేటర్ రాపర్తి కన్నా, సురేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషనర్ రాజబాబు, అదనపు కమిషనర్ సన్యా సిరావు మాట్లాడుతూ కచ్చితంగా చర్యలు తీసుకుంటా మని వివరణ ఇచ్చారు. లక్షలాది రూపాయల కుంభ కోణాన్ని సహించేది లేదని టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సివిల్ పనులు చేసుకుంటూ డబ్బులు సంపాదిస్తారని, మా వార్డులో శంకుస్థాపనలు చేసి పనులు ఎందుకు ప్రారంభించడం లేదని, జీవీఎంసీ అధికారులు కుళ్లి కుళ్లి చస్తారంటూ 48వ వార్డు బీజేపీ కార్పొరేటర్ గంకల కవిత ఫైర్ అయ్యారు. తన వార్డులో పనులేవీ జరగడం లేదని ఆవే దన చెందిన కవితను తక్షణమే అధికారులు ప్రజా ప్రతినిధులు అడ్డుకున్నారు. అధికారులు కొంతమంది బయటకు వెళ్లిపోయారు. అధికార వైసీపీ సభ్యులు కూడా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ కవిత తీరుపై మండిపడ్డారు. దీంతో మేయర్ కలుగ చేసుకుని కవిత తక్షణమే తన వ్యాఖ్యల్ని ఉపసంహరించుకోవాలని మేయర్ హెచ్చరించారు. అయినప్పటికీ కవిత వినలేదు. దీంతో మున్సిపల్ యాక్టు 89 ప్రకారం కవితను సస్పెండ్ చేస్తున్నట్టు మేయర్ ప్రకటించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీలు వరుదు కళ్యాణి, పివిఎన్ మాధవ్, వంశీకృష్ణ శ్రీనివాస్, రవీంద్రబాబు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తోపాటు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

విజయసాయిరెడ్డి, సుబ్బారెడ్డిని కలిసిన శరగడం

విశాలాంధ్ర - పెందుర్తి: వైసీపీ అగ్రనేతలు ఎంపీ వి.విజయ సాయి రెడ్డి, టిటిడి చైర్మన్, ఉత్తరాంధ్ర జిల్లాల పార్టీ కన్వీనర్ వై.వి.సుబ్బారెడ్డి శుక్రవారం విశాఖ శ్రీ శారదా పీఠాన్ని సందర్శించారు. పీఠాధిపతులు స్వరూపా నందేంద్ర స్వామి, ఉత్తర పీఠాధిపతి స్వాత్మానందేంద్ర స్వామిలను కలిసి వారి ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం పీఠం ఆవరణలో గల దేవతామూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. వైసీపీ సీనియర్ నాయకుడు, రూరల్ జిల్లా పార్టీ మాజీ అధ్యక్షుడు శరగడం చిన అప్పలనాయుడు, శారదా పీఠం వద్ద సాయి రెడ్డి, సుబ్బారెడ్డిలకు ఘన స్వాగతం పలికారు. వారిద్దరిని శాలువాతో సత్కరించి అభిమానం చాటుకున్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు అవగడ్డ అప్పల నాయుడు, ఎర్ర అప్పలరాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శరగడం మహాలక్ష్మి నాయుడు, శరగడం రామకృష్ణ తదితరులు ఉన్నారు.

ఉద్యోగుల సంక్షేమానికి కృషి

విశాలాంధ్ర - కోటఉరట్ల: మండలంలో పనిచేస్తున్న గ్రామ వార్డు సచివాలయం ఉద్యోగస్తుల సంక్షేమానికి కృషి చేస్తానని నూతనంగా ఎంపికైన గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం మండల శాఖ అధ్యక్షుడు రామకృష్ణ, జనరల్ సెక్రటరీ సురేష్ నాయుడు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో గ్రామ వార్డు సచివాలయం ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులంతా సమావేశమై మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో మండల శాఖ అధ్యక్షులుగా రామకృష్ణ, జనరల్ సెక్రటరీగా రమేష్ నాయుడు, ఉపాధ్యక్షుడిగా జి.రమేష్, జాయింట్ సెక్రటరీగా సూరిబాబులతోపాటు ఇతర కార్యవర్గాన్ని సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఎంపీడీవో చంద్రశేఖర్‌ని కలిసి కార్యవర్గం ఎంపిక, సచివాలయం సిబ్బంది ఎదుర్కొంటున్న పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రాజకీయ జోక్యం లేకుండా పీఎంఏవై గృహాలను ఇవ్వాలి

విశాలాంధ్ర - ముంచింగిపుట్టు: మండలంలో నూతనంగా మంజూరైన పీఎంఏవై గృహాలను రాజకీయ జోక్యం లేకుండా పారదర్శకంగా అర్హులందరికీ ఇవ్వాలని లక్ష్మీపురం సీపీఎం సర్పంచ్ కొర్ర త్రినాథ్ డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో వచ్చి మూడు సంవత్సరాలు పూర్తి అవుతున్నా ఒక్క ఇళ్లు కూడా ఇచ్చింది లేదని, కేవలం ఇళ్ల పట్టాలు ఇచ్చి జి.పి.ఎస్.సర్వేలు, ఈ-కేవైసీలు పేరు చెప్పి కాలయాపన చేస్తుందన్నారు. కేంద్రం నుండి మంజూరైన సుమారు 400 పైగా ఇళ్లన వివక్షతతో లక్ష్మీ పురం, బరడ, బుంగపుట్, బూసిసిపుట్టు, కిలగాడ, సుజనకోట పంచాయ తీలలో ఒక్క ఇళ్లు కూడా కేటాయించకపోవడం దారుణమన్నారు. అర్హులైన లబ్ధిదారులను పారదర్శకంగా గుర్తించి ఇళ్లు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు.

రాష్ట్ర ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలి: వైవీ సుబ్బారెడ్డి

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వారిని కార్తీక ఏకాదశి సందర్భంగా తితిదే పాలక

మండలి అధ్యక్షులు వై.వి. సుబ్బారెడ్డి సతీ సమేతంగా దర్శించుకున్నారు. వీరికి కార్యనిర్వహణాధికారి వి.త్రినాథరావు, ఏ.ఈ.ఓ ఆనంద్ కుమార్, సింహాచలం దేవస్థానం పాలక మండలి సభ్యులు పూలమాలలు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. అర్చక స్వాములు పూర్ణకుంభంతో, వేదమంత్రోచ్ఛరణతో ఆహ్వానం పలికారు. తొలుత వీరు కప్పస్థంభం ఆలింగనం చేసుకుని భేడా ప్రదక్షణ చేశారు. స్వామివారి శేషవస్త్రంతో ఈఓ సత్కరించి స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట డిప్యూటీ మేయర్ శ్రీధర్, పాలక మండలి సభ్యులు దినేష్ రాజు, శ్రీదేవివర్మ, రాజేశ్వరి, పాత్రుడు తదితరులు ఉన్నారు.

కార్యకర్తలకు జీవితాంతం రుణపడి ఉంటా
మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

విశాలాంధ్ర - నర్సీపట్నం: తాను బతికున్నంత కాలం తెలిసి తప్పు చేయలేదని, భవిష్యత్తులో చేయనని, తన కుటుంబానికి అండగా నిలిచిన కార్యకర్తలకు జీవితాంతం రుణపడి ఉంటానని మాజీమంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. గురువారం ఉదయం సిఐడీ అరెస్టు తర్వాత బెయిల్ మంజూరు కావడంతో నర్సీపట్నం వచ్చిన అయ్యన్నపాత్రుడుకు టీడీపీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. అనంతరం

ఇంటికి చేరుకున్న అయ్యన్న కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. తనను ఏమి చేయలేరు కాబట్టే అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. రోడ్లు మీద గుంతలు పూడ్చలేకపోతున్నారని, ఇసుక అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఎన్ని కేసులు పెట్టినా నా మాట ఒక్కటే...ఒక్కటే పార్టీ అన్నారు. కార్యకర్తలకు ఎప్పుడు రుణపడి ఉంటానని, ఒక వేళ మర్చిపోతే పుట్టగతులు ఉండవని అయ్యన్నపాత్రుడు స్పష్టం చేశారు.

పురవీధుల్లో హరినామ సంకీర్తన

విశాలాంధ్ర - రావికమతం: కొత్తకోట గ్రామంలో కార్తీక ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీ పద్మావతి భజన మండలి ఆధ్వర్యంలో వేకువజాము నుంచే గ్రామ పురవీధుల్లో శ్రీవారి అఖండ హరినామ సంకీర్తన నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులను గ్రామ పురవీధుల్లో అత్యంత కోలాహల వాతావరణంలో భాజా భజంత్రీల మేళతాళాలతో ఊరేగించారు. అలాగే అత్యంత ప్రసిద్ధి చెందిన గుమ్మడి వీధి రామాలయంలో కార్తీకమాస పవిత్ర ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసినట్టు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

క్షయవ్యాధిపై భయాందోళన వద్దు

విశాలాంధ్ర - హుకుంపేట: ప్రజలు క్షయ వ్యాధిపై భయాం దోళన చెందవద్దని డాక్టర్ అనుష అన్నారు. శుక్రవారం మండలంలో సంతరి గ్రామంలో టిబి వైద్య శిబిరం నిర్వహించి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. క్షయ వ్యాధి పట్ల ఆందోళన చెందకుండా డాక్టర్ల సలహాలు సూచనలు తప్పక పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిబి సూపర్వైజర్ సదా నందం, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఏవోబి నిర్వాసితుల నిరసన

విశాలాంధ్ర - యస్.రాయవరం: నేవల్ బేస్ నిర్వాసితులు నిరసనకు దిగారు. మండలంలోని వాకపాడు రెవెన్యూ పరిధిలోని నేవల్ బేస్ నిర్మాణం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం వాకపాడు, బంగారమ్మపాలెం గ్రామాల్లో నిరసన దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మత్స్యకారులు, భూములు కోల్పోయిన వారికి నష్టపరిహారం చెల్లించాలని, ఉపాధి కల్పన వంటి అనేక సమస్యలు తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మైలపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ పి.మాధవ్, మాజీ సర్పంచ్ కారే కృష్ణ, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

కొర్రాలో వైద్య శిబిరం

విశాలాంధ్ర - డుంబ్రిగూడ: మండలంలోని కొర్రా సచివాలయంలో డుంబ్రిగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించి ఇంటింటికి వెళ్లి వైద్య సేవలు అందించారు. వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్న 59 మంది వ్యాధిగ్రస్తులకు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రాంబాబు ఇంటింటికి వెళ్ళి వైద్య పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందించారు. వ్యాధిగ్రస్తులకు మందులను పంపిణీ చేశారు. అనంతరం వైద్యాధికారి రాంబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు కాచి చల్లార్చిన నీటిని వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో 104 వైద్యాధికారి సిద్ధార్థ్, హెచ్‌వి పద్మ, హెచ్ఎస్ సాంబశివరావు, హెల్త్ అసిస్టెంట్ లోవరాజు, సిహెచ్ఓ కోమలి, వైద్య సిబ్బంది, వ్యాధిగ్రస్తులు పాల్గొన్నారు.

జిల్లా ఆసుపత్రిలో గైనిక్ సమస్య తీర్చాలి

విశాలాంధ్ర - పాడేరు : స్థానిక జిల్లా ఆసుపత్రిలో గైనిక్ వైద్యులు ఒకరే కావడం మరో వైద్యులు లేక గర్భిణీలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గర్భిణీలకు స్కానింగ్ తదితర పరీక్షలు నిర్వహించేందుకు తప్పనిసరిగా గైనిక్ వైద్యులు ఉండాలని గైనిక్ వైద్యులు లేక శస్త్ర చికిత్సలు సమయంలో గర్భిణీలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రోజు రోజుకు గర్భిణీలు తనిఖీల కోసం వందలాది మంది ఆస్పత్రిలో పడి గావులు కాస్తున్నారు. వైద్యం

అందక కొం దరు వెనుతిరిగే పరిస్థితి నెలకొంటుంది. దీంతో వైద్యం సకాలంలో అందక గర్భిణీలు, బాలింతలు మృత్యువాత పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వైద్య బృందాన్ని నియమించాలని డిమాండ్ చేశారు.

మాదకద్రవ్యాలకు బానిస కావద్దు

విశాలాంధ్ర - భీమునిపట్నం: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా వుండాలని భీమిలి ఎస్ఐ వి.రామకృష్ణ అన్నారు. భీమునిపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మాదక ద్రవ్యాలు, ఇసుక అక్రమ రవాణా, నాటుసారాయికి సంబంధించిన సమా చారాన్ని టోల్ ఫ్రీ నెంబర్ 14500కి తెలియచేయ వచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, ఇతర అధ్యాపకులు, ఎస్ఐ డి.పద్మావతి, ఈసీలు కెవి రావు, మధు, వహీదా దేవి, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నేతను కిడారి పరామర్శ

విశాలాంధ్ర - అనంతగిరి: టీడీపీ సీనియర్ నాయకులు సమర్ది దొన్నును మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ పరామర్శించారు. ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడి కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న దొన్నును కిడారి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సాగర సుబ్బారావు, అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి బాకురు వెంకటరమణ రాజు, అరకు పార్లమెంట్ టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు తామర్ల సత్య నారాయణ, టీడీపీ డివిజన్ నాయకులు పాంగి పాండురంగ స్వామి, టీడీపీ నాయకులు త్రినాథ్, మురళి, రాజు తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్‌లో అవగాహన సదస్సు

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: దువ్వాడ విజ్ఞాన్ ఇనిస్టిట్యూట్ అఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో ఏకాగ్రత, జ్ఞాపకశక్తిని పెంచుకోవడంపై శుక్రవారం సదస్సు నిర్వహించారు. ప్రొఫెషనల్ స్పీకర్, లిమ్కా బుక్ అఫ్ రికార్డు హెూల్డర్ అనంత్ కాశీభట్ల మాట్లాడుతూ జ్ఞాపకశక్తిని ఎలా మెరుగుపరుచుకోవాలి, ఏకాగ్రతను పెంచుకోవడంలో మెళకువలను విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల రెక్టర్ డాక్టర్ వి.మధుసూధనరావు డీన్ ఆర్‌డి డాక్టర్ లక్ష్మి లిధియా తదితరులు పాల్గొన్నారు.

సదరం క్యాంపునకు ఉచిత బస్సు



విశాలాంధ్ర - సీలేరు: పోలీసుల ఆధ్వర్యంలో చింతపల్లిలో నిర్వహిస్తున్న సదరం క్యాంపునకు సీలేరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత బస్సును సీలేరు ఎస్సై రామకృష్ణ పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. చింతపల్లి ఏఎస్పీ కె.ప్రతాప్‌శివకిశోర్ ఆధ్వర్యంలో చింతపల్లిలో 4, 5 తేదీల్లో ఏర్పాటు చేసిన సదరం క్యాంపునకు సీలేరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని సీలేరు, దారకొండ, దుప్పుల వాడ, గుమ్మిరేవుల, గాలికొండ పంచాయతీల్లోని సుమారు 90 మంది దివ్యాంగులకు ఉచితంగా బస్సును ఏర్పాటు చేశారు.

5వ వార్డు సమస్యలు పరిష్కరించండి
కౌన్సిల్‌లో కార్పొరేటరు హేమలత

విశాలాంధ్ర - మధురవాడ: జీవీఎంసీ 5వ వార్డ్ పరిధిలో కొండవాలు ప్రాంతాలలో నీటి కష్టాలను వెంటనే తీర్చి, ఆ వార్డ్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని శుక్రవారం జరిగిన జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో కార్పొరేటర్ మొల్లి హేమలత కోరారు. వార్డ్‌లో పలు శంకుస్థాపనలు జరిగి నెలలు గడిచినా ఆ పనులు మాత్రం ప్రారంభించడం లేదని, ఇప్పటికైనా ప్రత్యేక దృష్టి సారించి 5వ వార్డ్‌లో మౌలిక సదుపాయాలైన త్రాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, వీధిలైట్లు, శ్మశాన వాటికల అభివృద్ధి చేయాలని కోరారు. దానిపై సానుకూలంగా స్పందించిన జీవీఎంసీ కమిషనర్ పి.రాజబాబు త్వరలోనే వార్డులో పర్యటించి పరిష్కార మార్గం చూపుతామని హామీ ఇచ్చారు.

నష్టపరిహారం చెల్లించాలి

విశాలాంధ్ర - అనకాపల్లి: మండలంలోని మూల పేట గ్రామంలో పులి దాడిలో మేకలు మరణించిన సంఘటనా స్థలాన్ని శుక్రవారం అఖిలపక్ష నేతలు సందర్శించారు. సిపిఐ జిల్లా నాయకులు వైఎన్ భద్రం, బిఎస్‌పి జిల్లా ఇంచార్జ్ సూదికొండ మాణిక్యాలరావు, ఆమ్ ఆద్మీ పార్టీ నేత కొణతాల హరినాథ్ బాబు, చేతివృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ కోన లక్ష్మణ ప్రజా సంఘాల నేతలు శ్రీరామ్, ఎల్లంకి సత్యనారాయణ తదితరులు సంఘటన జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. చనిపోయిన సుమారు ఇరవై అయిదు మేకలను చూసి అఖిల పక్షం నేతలు తీవ్రంగా ఆవేదన చెందారు. పులి దాడిలో చనిపోయిన మేకలకు ఒక్కో మేకకు లక్ష రూపాయలు చొప్పున ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి మేకల పెంపకం దారులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

61వ వార్డులో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదు

విశాలాంధ్ర - మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం పరిధి 61వ వార్డులో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు నమోదు కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం వార్డు టీడీపీ అధ్యక్షులు మజ్జి సోమేష్ ఆధ్వర్యంలో మల్కాపురం జాలరవీధి సమీపంలో నిర్వహించిన కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో 61వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థి సర్వసిద్ధి శ్రీ లక్ష్మి, చింతలపూడి సత్య నారాయణ, ఉరుకుటి పైడిరాజు, కదిరి దుర్గారావు, ఎల్లారావు పాల్గొన్నారు.

ఎంపీయూపీ పాఠశాల నూతన భవనానికి ఆమోదం తెలపాలి
సర్పంచ్ కోన పైడిరాజు

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలో బంటుపల్లి వారి గ్రామ పంచాయతీ ఎంపీ యూపీ పాఠశాల భవనం శిధిలావస్థలో వుందని నూతన భవనం నిర్మించాలని, అలాగే అంగన్వాడీ భవనం, కల్యాణ మండపాన్ని కూడా నిర్మించాలని సర్పంచ్ కోన పైడిరాజు అన్నారు. ప్రస్తుతం 69 మంది మాత్రమే విద్యార్థులు విద్యనభ్యసిస్తుండగా భవనం శిథిలావస్థలో వుండడంతో వేరే పాఠశాలలకు పంపిస్తున్నారని అన్నారు. దీనిపై స్థానిక బీపీ గ్రామపంచాయతీ సర్వే నెం బర్ 39/5లో ఉన్న ఖాళీ స్థలంలో పాఠ శాల, అంగన్వాడి కేంద్రం, కళ్యాణ మం డపం, ఆటస్థలం నిర్మించాలని గతంలో ఎమ్మెల్యేకి వినతి ఇచ్చారని, స్థలాన్ని సర్వే చేయాలని తహశీల్దార్ వేణుగోపాల్‌ని ఆదేశించారని అయినా మోక్షం కలగలేదని అన్నారు. పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని పాఠశాల భవనంకు వెంటనే ఆమోదం తెలపాలని అన్నారు.

సమయపాలన పాటించని ఆయుష్ వైద్యులు

విశాలాంధ్ర - యలమంచిలి: రేగుపాలెం పి.హెచ్.సిలో ఆ విభాగ వైద్యులు శుక్రవారం ఉదయం సమయం 10:45 అయినా కాన రాలేదు. పరిసర గ్రామాలన్నింటికి రేగుపాలెం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రమే పెద్దది కాబట్టి ఆ ప్రభుత్వ ఆసుపత్రికే పరిసర గ్రామ పేద ప్రజలు వైద్యం కోసం వస్తుంటారు. ఆ విభాగానికి సంబంధించి

మందులు ఇచ్చేది ఆయుష్ విభాగ ఫార్మసిస్ట్ మాత్రమే. ఈ విషయమై ఇదివరకు జరిగిన మండల సర్వ సభ్య సమావేశంలో ఎంపీపీ బి.గోవింద్ ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేయగా అప్పుడు ఆసుపత్రి వైద్యాధికారిని ప్రస్తుతం సమయానికి వస్తున్నట్టు సమర్థించారు. ప్రస్తుతం వైద్యాధికారిణి డా.సుగుణ ఇదే విషయంపై కొంతమంది ప్రింట్ మీడియా ప్రతినిధులు వివరణ కోరగా 9 గంటలకు ఆయుష్ విభాగ వైద్యులు రావాల్సిఉందని బదులిచ్చారు. దీనిపై ఆయుష్ విభాగ ఉన్నత వైద్యాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని, పలు గ్రామాల ప్రజలకు సక్రమమైన వైద్యం అందే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్యలపై దృష్టిసారించండి: ఎమ్మెల్యే ముత్తంశెట్టి

విశాలాంధ్ర - పద్మనాభం: మండలంలో సమస్యలపై దృష్టిసారించాలని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండల పరిషత్ సమావేశం మందిరం వద్ద సర్వసభ్య సమావేశం జరిగింది. కొంతమంది అధికారులు, నాయకులు హాజరు కాకపోవడం పట్ల ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆలస్యంగా వచ్చిన మండల ఆరోగ్యశాఖ అధికారిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలో రెండవ ఆరోగ్య కేంద్రం మంజూరైనా ఇప్పటివరకు వాటి పనులు ముందుకు సాగకపోవడంపై మండల వైద్యాధికారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 20 రోజుల్లోగా రెండవ ఆరోగ్య కేంద్రం ఏర్పాటు అయ్యేలా చూడాలని కావలసిన సిబ్బందిని వెంటనే నియమించాలని మండల అధికారికి ఆదేశాలు ఇచ్చారు. పాత స్తంభాల మార్పు, అవసరమైన చోట ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు తదితర పనులు చేపట్టాలని అన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ రాంబాబు, జడ్పిటిసి ఎస్.గిరిబాబు, వైసీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు అధికారులు పాల్గొన్నారు.

వ్యవసాయ సలహా మండలి సమావేశాలు విధిగా జరగాలి

విశాలాంధ్ర - కె.కోటపాడు: రైతు భరోసా కేంద్రాలలో వ్యవసాయ సలహా మండలి సమావేశాలు ప్రతి నెలా మొదటి శుక్రవారం ఏర్పాటు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారిని లీలావతి అన్నారు. ఈ మండలం గుల్లేపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆమె మాట్లాడారు. రైతు భరోసా కేంద్రాలలో ప్రదర్శింపబడిన సోషల్ ఆడిట్ లిస్ట్, పంట వివరాలు తనిఖీ చేసుకుని అభ్యంతరాలు ఉన్నచో వెంటనే తెలియజేయాలని అన్నారు. ప్రతి మొదటి శుక్రవారం ఈ సలహా మండలి సమావేశం జరుగుతుందని దీని ద్వారా ఆ గ్రామానికి వ్యవసాయ సంబంధిత సలహాలు సూచనలు తీసుకొని వాటిని అమలు పరిచే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రెండవ పంట కు గుల్లేపల్లి గ్రామానికి వేరుశనగ విత్తనాలను సకాలంలో రైతులకు అందించేవిధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామా సర్పంచ్ బండారు దేముళ్ళు, మండల వ్యవసాయాధికారి సోమ శేఖర్, ఏఈఓ లైలా దేవి పాల్గొన్నారు.

కళాశాల విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

విశాలాంధ్ర - పరవాడ: విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా ఉక్కు నగరం పవర్ గ్రిడ్ సంస్థ ఆధ్వర్యంలో పరవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు శుక్రవారం వక్తృత్వ పోటీలు నిర్వహించారు. తొలుత పోటీలను పవర్ గ్రిడ్ విద్యుత్ సంస్థ చీఫ్ మేనేజర్ జి.ఈశ్వరరావు ప్రారంభించగా కళాశాలకు చెందిన 55 మంది జూనియర్, సీనియర్ ఇంటర్ విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొన్నారు. ఇందులో పి.హర్షిత (ప్రథమ), ఎన్.ప్రవీణ (ద్వితీయ), డి.నవీన్ (తృతీయ), ఎ. దివ్య (నాలుగవ) స్థానాల్లో విజేతలుగా నిలిచారు. వీరితో పాటుగా జి.ప్రియ, పి.భూమిక, ఎస్.స్వేత ప్రోత్సాహక బహుమతులు గెలుపొందారు. ఈ కార్యక్రమంలో సీనియర్ లెక్చరర్ లలితా కుమారి, పవర్ గ్రిడ్ సంస్థ ఉద్యోగులు గౌరీశంకరావు, దేవి వరప్రసాద, పైల అప్పారావు, ఉమా శంకర్, మహేష్, ప్రియాంక, అపూర్వ కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైల్వేగేట్ వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణ పనులు పునఃప్రారంభం

విశాలాంధ్ర - యలమంచిలి: యలమంచిలి-అనకాపల్లి రైల్వే గేటు వద్ద గత కొన్ని సంవత్సరాలుగా ఆగిపోయిన ఫ్లై ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణ పనులను శుక్రవారం యలమంచిలి మున్సిపల్ చైర్మన్ పిల్లా రమా కుమారి, ఎంపీపీ గోవింద్‌లు కొబ్బరి కాయ కొట్టి పునఃప్రారం భించారు. సుమారు రూ.35 కోట్ల వ్యయంతో ఫ్లై ఓవర్ వంతెన నిర్మాణ పనులను 2009 ఫిబ్రవరి 15న అప్పటి రాష్ట్ర మంత్రి కొణతాల రామకృష్ణ శంకుస్థాపన చేశారని అన్నారు. ఆ తర్వాత ఎన్నికలు రావడం, భూసేకరణ పనులలో జాప్యం తదితర కారణా లతో నిర్మాణ పనులు మందగించాయని, ఆ తర్వాత గెలిచిన ఎమ్మెల్యే హయాంలో పలు కారణాల వల్ల బ్రిడ్జ్ నిర్మాణ పనులు పూర్తి చేయలేకపోయారని అన్నారు. అనంతరం 2019లో ఎమ్మెల్యే కన్నబాబు రైల్వే ఫ్లై ఓవర్ వంతెన నిర్మాణ సమస్యని యలమంచిలి పట్టణ ముఖ్య సమస్యగా తీసుకుని అనేకసార్లు ప్రభుత్వంతో, అలాగే ఆర్ అండ్ బీ ఉన్నతాధికారులతో చర్చించారని, రూ.8 కోట్ల 10 లక్షల రూపాయలతో పునఃప్రారంభించిన నిర్మాణ పనులు 2023 జూన్ నాటికి పూర్తి కానున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరరావు, అరేపు గుప్తా, పట్టణ పార్టీ అధ్యక్షుడు ఎర్రయ్య దొర, కౌన్సిలర్ పి.సత్తిబాబు, మరి నీశ్వరరావు, వర్ధమాన్ కన్స్ట్రక్షన్స్ రాజు, వైసిపి సీనియర్ నాయకులు సేనాపతి రాము, కర్రి శివ, దాసరి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సింహాచలం కొండ రక్షణ గోడ నిర్మాణానికి శంకుస్థాపన

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: సింహాచల భూముల ఆక్రమణలను నిరోధించడానికి శారదాపీఠం నిరంతర పోరాటం చేస్తోందని విశాఖ శ్రీ శారద పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి చెప్పారు. సుమారు 25 కోట్ల రూపాయల వ్యయంతో చినగదిలి నుంచి, జ్ఞానానంద ఆశ్రమం వరకు సింహాచలం కొండ చుట్టూ 4.15 కిలోమీటర్ల నిడివి గల ప్రాంతంలో రక్షణ గోడ నిర్మాణానికి స్వరూపానందేంద్ర సరస్వతి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో స్వామి మాట్లాడుతూ సింహాచలం కొండ చుట్టూ ఉన్న ప్రాంతం చాలా కాలంగా ఆక్రమణలకు గురవుతోందని 575 ఎకరాల్లో ఉన్న ఈ కొండవాలు ప్రాంతాన్ని కాపాడాలని జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడే తాను సూచించానని అన్నారు. ఎంపీ విజయసాయిరెడ్డి మాట్లాడుతూ ఈ గోడ నిర్మాణానికి, ఎంపీ లార్డ్స్ నుంచి ఐదు కోట్ల రూపాయలు కేటాయించానని, అలాగే అనకాపల్లి ఎంపీ సత్యవతమ్మ మూడు కోట్ల రూపాయలు కేటాయించారని, మరో 16 కోట్ల రూపాయలను వివిధ కంపెనీల నుంచి సిఎస్ఆర్ నిధుల కింద సేకరించి త్వరితగతిని నిర్మాణ పనులు పూర్తి చేస్తామని చెప్పారు. టీటీడీ చైర్మన్, ఉత్తరాంధ్ర జిల్లాల వైసీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ సుభద్ర, ఎంపీ మాధవి, అనకాపల్లి ఎంపీ సత్యవతి, మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్, మేయర్ హరి కుమారి, వీఎమ్మార్డీఏ చైర్ పర్సన్ అక్కరమాని విజయనిర్మల, ఎమ్మెల్యేలు నాగిరెడ్డి, అదీప్ రాజ్, మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, ఎమ్మెల్సీలు వరుదు కళ్యాణి, వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్, కలెక్టర్ మల్లికార్జున, ఉత్తర నియోజకవర్గం ఇన్చార్జి కేకే రాజు తదితరులు పాల్గొన్నారు.

గన్నవరం సచివాలయంను ఎంపీడీఓ తనిఖీ

విశాలాంధ్ర - నాతవరం: నాతవరం మండలం గన్నవరం సచివాలయంను శుక్రవారం నాతవరం ఎంపీడీఓ యాదగిరీశ్వరరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల గురించి ప్రజలకు ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో గణేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి ఎస్కె.హుస్సేన్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ మమత తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు 24 మంది విద్యార్థులు

విశాలాంధ్ర - మాకవరపాలెం: మండలంలో తామరం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన 24 మంది విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్ఎం రామయ్య తెలిపారు. నియోజకవర్గ స్థాయి వాలీబాల్, ఖోఖో, షటిల్, బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో సత్తా చాటారన్నారు. అనంతరం పోటీలకు ఎంపికైన విద్యార్థులను వ్యాయమ ఉపాధ్యాయుడు ప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఓటరు నమోదుకు 6097 దరాఖాస్తులు

విశాలాంధ్ర - పాడేరు: శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గంలో ఓటరుగా 6097 దరఖాస్తులు అందాయని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. ఆన్ లైన్‌లో 5038, ఆఫ్ లైన్‌లో 1059 ధరాఖాస్తులు అందాయని, వాటిని పరిశిలించి ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారికి పంపించటం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. 23 నుండి డిసెంబర్ 09 వరుకు అభ్యంతరాల స్వీకరణ సమయంలో కూడా ఫారం 18-19 ద్వారా ఓటరుగా నమోదుకు అవకాశం కల్పించారని కలెక్టర్ వివరించారు.

పొంచి వున్న ప్రమాదం

విశాలాంధ్ర - ముంచింగిపుట్టు: మండల కేంద్రంలో జిసిసి డిపో గోదాము ఎదురుగా ఉన్న రహదారి ప్రక్కన విద్యుత్ స్తంభం ప్రమాదభరితంగా ఉంది. గడిచిన ఏడాదిన్నరగా ఈ స్తంభం ఒరిగిపోయి ఉన్నప్పటికీ నేటికీ సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోకపోవడం విచారకరం. ప్రమాదం సంభవిస్తే పదుల సంఖ్యలో ప్రాణహాని జరిగే ప్రమాదం ఎక్కువగా ఉంది. డి ఆర్ డిపో దగ్గరగా ఉండడం నిత్యావసర సరుకులు కోసం ప్రజలు రావడం సంత రోజు అయితే ప్రజలు అధికంగా ఆ ప్రాంతంలో ఉంటారు. ప్రమాదవశాత్తు వైరు తెగితే చాలా మంది ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి స్తంభాన్ని మార్చాలని పలువురు కోరుతున్నారు.

బాలికలు క్రీడల్లో రాణించాలి

విశాలాంధ్ర - మల్కాపురం: బాలికలు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని జి.వి.ఎం.సి. 61వ వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ అన్నారు. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమేనని, వాటిని సమానంగా స్వీకరించాలని అన్నారు. జిల్లా వృత్తి విద్యా అధికారి ఎన్.బెన్నస్వామి మాట్లాడుతూ ఇటువంటి క్రీడా ఉత్సవాల వల్ల యువతలో ఉత్సాహం వెల్లి విరుస్తుందని అన్నారు. సమావేశంలో జూనియర్ కళాశాలల గేమ్స్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జి.రాంబాబు, సెయింట్ ఆన్స్ నార్తరన్ అసిస్టెంట్ ప్రోవిన్షియల్ సిస్టర్ సలీన, కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్లా, సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ప్రేమ కుమారి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ జానిస్ పాల్గొన్నారు.

చౌదరి కళ్యాణ్‌కు ఘన నివాళులు

విశాలాంధ్ర - పెందుర్తి: ఇటీవల మృతి చెందిన సంఘసేవకుడు, బిజెపి నాయకుడు చౌదరి కల్యాణ్ కుమార్‌కు పలువురు ప్రముఖులు ఘన నివాళులర్పించారు. శుక్రవారం ఆర్.ఆర్.లిమిటెడ్ కార్యాలయం వద్ద చౌదరి సహ విద్యార్థులు సంస్మరణ సభ ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా చౌదరి కళ్యాణ్ సమాజానికి అందించిన సేవలను నాయుకులు ప్రస్తుతించారు. కార్యక్రమంలో సంఘం చైర్మన్ సనపల బంగారు రాజు, పెన్షన్ సంఘం అధ్యక్షుడు చౌదరి అప్పారావు, ఎస్. శ్రీనివాస్, వరప్రసాద్, కే.వి.రమణ, ఎం.రాము, పి. గోపాల్, ఎస్.మాధవ, గౌరి. చంటి పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

వైసీపీ జిల్లా అధికార ప్రతినిది మళ్ళ బుల్లి

విశాలాంధ్ర - కశింకోట: మండల కేంద్రమైన కశింకోట గ్రామంలో శనివారం పలు అభివృద్ధి పనులు ప్రారంభం కాను న్నాయని ఈ కార్యక్రమానికి మంత్రి అమర్‌నాథ్ హాజరుకానున్నారని వైసీపీ జిల్లా అధికార ప్రతినిది మళ్ళ బుల్లి అన్నారు. శుక్రవారం కశింకోట వైసిపి కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీ పరిధిలో 130 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసామని వాటిని పర్యవేక్షించే కంట్రోల్,స్థానిక పోలీస్ కంట్రోల్ రూమ్, సచివాలయాల నూతన భవన నిర్మాణాలు తదితర పనులు ప్రారంభం కానున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని గ్రామంలో నాయకులు, కార్యకర్తలు అభిమానులు విజయవంతం చేయాలని కోరారు.

తాగునీటి నిర్మాణ పనుల్లో నాణ్యతా లోపం

విశాలాంధ్ర - హుకుంపేట: మండలంలోని కోట్నాపల్లి పంచాయితీ గ్రామంలో నాణ్యత లేకుండా జలజీవన్ మిషన్ పథకం ద్వారా తాగునీటి నిర్మాణ పనులు చేసారని ఎంపిటిసి బాలక్రిష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రజలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆయన ఆ గ్రామాన్ని సందర్శించి జల జీవన్ మిషన్ పథకం పనులు పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేసారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మంచినీటి సమస్య పరిష్కరం చేయుటకై 11 లక్షలు జలజీషన్ పథకం నిధులు మంజూరు చేస్తే నాణ్యత లేకుండా నిర్మాణ పనులు చేపట్టారని అన్నారు. అధికారులు స్పందించి కాంట్రాక్టర్‌కు బిల్లు నిలుపుదల చేసి నాణ్యత తో నిర్మాణ పనులు జరిగే విధంగా చూడాలని అన్నారు.

ఫ్లోరిఫైడ్ రైస్‌పై అపోహలు వద్దు

జీసీసీ మేనేజర్ వెంకటేష్

విశాలాంధ్ర - అరకులోయ: గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఫ్లోరిడిఫైడ్ రైస్ పంపిణీపై ఎటువంటి అపోహలు వద్దని బ్రాంచి మేనేజర్ బుక్క వెంకటేష్ తెలిపారు. శుక్రవారం ఆయనను కలిసిన విలేకరులతో ప్రత్యేకంగా మాట్లాడుతూ ఈ రైస్ వల్ల ప్రజల ఆరోగ్యం ఎంతగానో మెరుగు పడుతుందని అన్నారు. ఆరోగ్యానికి మేలు చేసే అనేక విటమిన్లు ఉన్నాయని ఆ విటమిన్ల వల్లనే ఫ్లోరిఫైడ్ రైస్‌ను వినియోగించే ప్రజలు నేడు ఎంతో ఆరోగ్యంతో ఉంటున్నారని అన్నారు. లబ్ధిదారులకు ఎటువంటి అపోహాలు ఉన్నా, అనుమానాలు కలిగినా వెంటనే తమ కార్యాలయానికి సంప్రదించి తమ అనుమానాలను నివృత్తి చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఫ్లోరిఫైడ్ రైసు బయట కొనుగోలు చేయాలన్నా దొరకదని అది కేవలం జిసిసి డిపోల ద్వారానే సాధ్యమని ప్రజలంతా ఇది గ్రహించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అయ్యన్నను పరామర్శించిన మాజీ ఎమ్మెల్సీ పప్పల

విశాలాంధ్ర - నర్సీపట్నం: నర్సీపట్నంలో మాజీ మంత్రి చింతకాయల అయ్యన్న పాత్రుదుని, చింతకాయల రాజేష్‌ను మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ చలపతిరావు మాట్లాడుతూ ప్రహరీకి సిఐడికి సంబంధం ఏమిటన్నారు. ముఖ్యమంత్రి ఆనందం కోసం సిఐడి పనిచేస్తుందన్నారు. వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ప్రశ్నించినందుకు అయ్యన్న కుటుంబాన్ని ఇబ్బందులు గురిచేస్తుందని అన్నారు. 41ఏ నోటీసు ఇవ్వకుండా గోడలు దూకి గేట్లు వగలగొట్టి ఇళ్లల్లోకి దూరి తీసుకెళ్లడం ఎంతవరకు కరెక్టో సిఐడి అధికారులు తెలుసుకోవాలన్నారు.

అయ్యన్నకు బెయిల్ మంజూరుతో ఆలయంలో పూజలు

విశాలాంధ్ర - మాకవరపాలెం: మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడికి, ఆయన కుమారుదు రాజేష్‌కు బెయిల్ మంజూరు కావడం పట్ల శుక్రవారం మాకవరపాలెం మండలం టీడీపీ నాయకులు తామరం గ్రామంలో గల కనకదుర్గ అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు ఆర్.యర్రాపాత్రుడు, మాజీ జెడ్పీటీసీ రుత్తల శేషుకుమార్, మాజీ పీఏసీఎస్ అధ్యక్షులు అల్లు రామునాయుడు, కేతిరెడ్డి చిరంజీవి, కోసూరు శ్రీను, ఒబ్బలరెడ్డి వెంకటరమణ, జోగిపాత్రుడు, పాశపు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆవులకు టీకాలు వేయించాలి

విశాలాంధ్ర - రావికమతం: లంపి స్కిన్ వ్యాధి నివారణకు పాడి రైతులు ఆవులకు టీకాలు వేయించుకోవాలని పశు వైద్యాధికారి కే.జగన్మోహన్ సూచించారు. మట్టవాని పాలెం, గుడివాడ గ్రామాల్లో శుక్రవారం ఆవులకు, ఎద్దులకు లంపి స్కిన్ వ్యాధి నివారణకు ఉచితంగా టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో గుడివాడ సర్పంచ్ గుమ్మాల శంకర్రావు, పశు వైద్య సహాయకులు పి.నాగేశ్వరరావు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

జోనల్, రాష్ట్ర స్థాయి పోటీలకు దరఖాస్తులు

విశాలాంధ్ర - పాడేరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి ఆధ్వర్యంలో కళాకారులకు సాంప్రదాయ నృత్యరీతులైన కూచిపూడి నృత్యం, ఆంధ్ర నాట్యం, భరతనాట్యం, (సింగింగ్) దప్పులు, గరగలు తప్పిటగుళ్లు, కోలాటం, చెక్క భజన పులి వేషాలు, బుట్టబొమ్మలు, కాకా వేషాలు, ఉరుములు మరియు గిరిజన కళారూపాలైన ధింసా, కొమ్మకోయ, సవర బంబాడీ తదితర విభాగాలలో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక మరియు సంస్కృతి సమితి ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆర్ మల్లిఖార్జునరావు తెలిపారు. అనకాపల్లి, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, మన్యం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల కళాకారులకు డిసెంబర్ 7, 8, 9 తేదీలలో విశాఖపట్నంలో వుడా చిల్డ్రన్స్ థియేటర్లో పోటీలు నిర్వహింపబడతాయన్నారు. రాష్ట్రస్థాయి పోటీలు విజయవాడలో డిసెంబర్ 19, 20 తేదీలలో నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఆసక్తి గల కళాకారులు దరఖాస్తులను నవంబర్ 10వ తేదీ లోపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత మరియు సంస్కృతి సమితి కార్యాలయం, విజయవాడ నందు లేదా విజయనగరం రాజమండ్రి విజయవాడ, గుంటూరు నెల్లూరు: కర్నూలులోని ప్రభుత్వ సంగీత, నృత్య వళాశాలలు పాఠశాల నందు స్వయంగా సమర్పించాలని కోరారు.

అయ్యన్నను పరామర్శించిన బొర్రా

విశాలాంధ్ర - పాడేరు: టీడీపీ నాయకుడు, మాజీ మంత్రి అయ్యన్న పాత్రుదు అక్రమ అరెస్టును ఖండిస్తూ టిడిపి నాయకులు బొర్రా నాగరాజు విజయ రాణి ఆయన విడుదలైన సందర్భంగా ఆయనకు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర - ఆనందపురం: పోలంకి శ్రీనివాసరావు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆదేశాల మేరకు విద్యుత్ నిర్వహణ పనుల వలన ఆనందపురం, తర్లువాడ, పాలవలస, వేములవలస, వెల్లంకి, గొట్టిపల్లి, కుసులవాడ, చందక గ్రామాలకు శనివారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఇ సురేష్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు.

మాజీ మంత్రి అయ్యన్నకు పరామర్శల వెల్లువ

విశాలాంధ్ర - నర్సీపట్నం: గురువారం తెల్లవారుజామున సిఐడి పోలీసులు అరెస్టు చేసి అదే రోజు సాయంత్రానికి బెయిల్‌పై వచ్చిన మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడును పరామర్శించేందుకు టీడీపీ నేతలు తరలివచ్చారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, వరుపుల రాజా, యనమల కృష్ణుడు, రాష్ట్ర జిసిసి మాజీ చైర్మన్ ఎంవివి.ప్రసాద్ తదితరులు పరామర్శించారు.

భూమి రీసర్వేపై గ్రామసభ

విశాలాంధ్ర - నాతవరం: నాతవరం మండలం ఊటమల్ల గ్రామంలో శుక్రవారం జగనన్న శాశ్వత భూహక్కు రీ సర్వేపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటి తహశీల్దార్ చైనులు మాట్లాడుతూ జగనన్న భూహక్కు పథకం ద్వారా భూమి ఉన్న ప్రతీ రైతుకు శాశ్వత హక్కు కల్పించాలనే ఉద్దేశ్యంతో భూమి రీ సర్వే చేపడుతున్నామని, దీనికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్లు విజయ్, రాజేశ్వరి, విఆర్ఏ లు గ్రామ పెద్దలు పల్లి భాస్కరరావు, చిన్నారావు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఐదో రోజుకు చేరుకున్న నిర్వాసితుల ఆందోళనలు

విశాలాంధ్ర - రాంబిల్లి: ప్రతిష్టాత్మకంగా నిర్మాణం చేస్తున్న నేవల్ ప్రాజెక్టు కోసం భూములు, ఇళ్ళు, నదులు, తమ గ్రామాలు ఇచ్చి, ఉపాధిని కోల్పోయి నిరాశ్రయులైన నేవీ నిర్వాసితులను ఆదుకోకుండా గత కొన్ని సంవత్సరాలుగా నిర్వాసితులను ఇబ్బందులు పెట్టడం ప్రభుత్వాలకు తగదని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి అన్నారు. నేవీ నిర్వాసితులు తమ డిమాండ్లను పరిష్కరించాలని నేవల్ ప్రధాన గేటు వద్ద గత ఐదు రోజులుగా చేస్తున్న ఆందోళన శిభిరాన్ని శుక్రవారం ఆమె సందర్శించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, జిల్లా అధికార యంత్రాంగం నేవీ నిర్వాసితుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుండా తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆరోపించారు. నిర్వాసితుల సమస్యలును పరిష్కరించడంతోపాటు, 8 గ్రామాల మహిళలకు మగ వారితో సమానంగా ప్యాకేజీలు అమలు చేయాలని, ఉపాధిని కల్పించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికి నేవీ కాలనీ, గోవిందపాలెం, కొత్తపేట, చినకలవలావల్లి, వాడపాలెం గ్రామాలను ప్రభావిత గ్రామాలుగా గుర్తించి ప్యాకేజీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకురాలు జి.లక్ష్మి, మత్సకారులు. మత్యకార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శ కొల్లాటి శ్రీనివాస్, నవఎం మండల కార్యదర్శి జి.దేముడునాయుడు పాల్గొన్నారు.

50 కిలోల గంజాయి పట్టివేత

విశాలాంధ్ర - ముంచంగిపుట్టు: మండలంలోని దోడిపుట్టు పంచాయితీ పరిధిలో సుమారు రూ.లక్ష రూపాయల విలువైన 50 కిలోల గంజాయిని శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. ఆరుగురు గంజాయి స్మగ్లర్లను అరెస్టు చేసి అక్రమ రవాణాకు ఉపయోగించిన ఒక కారు, ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ రవీంద్ర తెలిపారు. ఆంధ్ర ప్రాంతం నుండి ఒరిస్సా ప్రాంతం వైపు వెళ్తున్న ఆటో, కారులో 50 కిలోల గంజాయి వున్నట్టు గుర్తించామని దీని విలువ లక్ష రూపాయలు వుంటుందని తెలిపారు. కారు, ఆటోను సీజ్ చేసి, 6సెల్ ఫోన్లను సైతం స్వాధీనం చేసుకున్నామన్నారు. ఒడిస్సా రాష్ట్రానికి చెందిన కొర్రపుట్ జిల్లా లంతాపుట్టు కు చెందిన గుప్తా దర్ల, బ్రహనిపుట్‌కు చెందిన కైలాష్ చంద్ర నాయక్, పాంగి సురేష్‌లు కాగా ఒడిశా రాష్ట్రం బట్నాయక్ గూడ, కొలాబ్ నగర్, కరెంగా గ్రామానికి చెందిన చిత్రసేన కిల్లో, కోలాబ్ నగర్‌కు చెందిన మున్న సగరియాలు, ఆంధ్ర ప్రాంతం ముంచంగిపుట్టు మండలం దోడిపుట్ గ్రామానికి చెందిన దొన్నో, పెదబయలు మండలం లింగేటి పంచాయతీ, బూరుగువీధి గ్రామానికి చెందిన సల్లంగి బన్నీలుగా గుర్తించామని తెలిపారు. ప్రస్తుతం దోడిపుట్ గ్రామానికి చెందిన గంజాయి స్మగ్లర్ దొన్నో పరారీలో ఉన్నారని తెలిపారు. ఈ దాడుల్లో ఏఎస్సై కె.లక్ష్మయ్య, పోలీసులు ఉన్నారు.

పవన్‌కు హాని కలిగిస్తే రాష్ట్రం అగ్నిగుండమే

విశాలాంధ్ర - నాతవరం: జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌కు ఏ చిన్న హాని జరిగిన రాష్ట్రం అగ్నిగుండంలా మారుతుందని, దీనికి పూర్తి బాధ్యత ప్రభుత్వానిదేనని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర పేర్కొన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. పవన్‌కళ్యాణ్ నివాసం వద్ద గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం రాత్రి అనుమానస్పదంగా తిరుగుతున్నారని టీవీలలో కథనాలు వచ్చాయని, కడప నుంచి కొందరు వ్యక్తులు వచ్చి పవన్‌కళ్యాణ్ కదలికలను గమనించినట్లు అనుమానాలు వ్యక్తం అవ్వడం పట్ల ఏదో కుట్ర జరుగుతుందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి పవన్‌కళ్యాణ్‌కు జెడ్ ప్లస్ కేటగిరీ భద్రత కల్పించి పూర్తి స్థాయిలో రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాతవరం మండల అధ్యక్షులు మల్లాటి శ్రీను, మండల యూత్ అధ్యక్షులు బైన మురళీ, నాతవరం మండల నాయకులు మంగళ భాస్కరరావు, పొన్నపు పోతురాజు, రెడ్డి రాజేష్, దొరబాబు, సుంకర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నూతన ఐటీడీఏ ఏర్పాటు చేయండి

భారతీయ ఆదివాసుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు రామగోపాల్

విశాలాంధ్ర - సీలేరు: చారిత్రక నేపథ్యం నుండి అన్ని రంగాలలో ఎంతో వెనుకబడిన చింతపల్లి ప్రాంతంలో రెవెన్యూ డివిజన్, నూతన ఐటీడీఏ ఏర్పాటు చేయవలసిన అవసరం ఉందని భారతీయ ఆదివాసుల సమాఖ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు గడుతూరి రామగోపాల్ అభిప్రాయ పడ్డారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 1955లో గూడెం మొట్టమొదటి గిరిజన నియోజకవర్గంగా ఏర్పడిందన్నారు. తర్వాత గూడెం రద్దై తర్వాత చింతపల్లి 1962లో నియోజకవర్గంగా ఏర్పడిందన్నారు. చింతపల్లి తాలుకాలో గ్రామాలుగా ఉన్న పాడేరు 1967లో నియోజకవర్గంగా తర్వాత 1973-74లో రెవెన్యూ డివిజన్‌గా, ఐటిడిఎగా ఏర్పడిందని, పాడేరు నేడు అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రంగా, అరలివేలి ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి బాటలో పయనిస్తున్నా యన్నారు. ఉనికిలో ఉన్న చింతపల్లి అసెంబ్లీ నిఒజకవర్గం 2009 నియోజకవర్గాల పునర్విభజనలో రద్దై అభివృద్ధిలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురికాబడుతుందన్నారు. బ్రిటిష్ జమానాలో ప్రభుత్వ కార్యాలయాలే చింత పల్లిలో నేటికి కనబడతాయని, ఆంధ్రా కాశ్మీర్‌గా పేరుగాంచిన లంబసింగి పర్యాటకంగా ప్రజలను విశేషంగా ఆకర్షిస్తున్నా పర్యాటకులు సేదతీరడానికి అక్కడ వసతి సౌకర్యాలు లేవన్నారు. గత ఎనిమిది సంవత్సరాలుగా టూరిజంశాఖ కాటేజిల నిర్మాణం చేపట్టి నేటికి పూర్తి చేయని పరిస్థితి ఉందన్నారు. చింతపల్లిలో జిల్లా పరిషత్, ఆర్అండ్‌బి వసతి గృహాలు నిరుపయోగంగా ఉన్నాయన్నారు. చాలా కాలం క్రితం చింతపల్లికి 100 పడకల ఆసుపత్రి మంజూరైనప్పటికీ దాని నిర్మాణానికి ఒక్క అడుగు ముందుకు పడలేదన్నారు. ప్రభుత్వం ఈ అంశాలన్నింటినీ దృష్టిలో పెట్టుకొని రెవెన్యూ డివిజన్, ఐటిడిఎ ఏర్పాటుకు కృషి చేయాలని అన్నారు.

మానవత్వం చాటుకున్న జెన్‌కో ఇంజనీర్ దంపతులు

విశాలాంధ్ర - సీలేరు: ఏపీ జెన్‌కో సీలేరు జలవిద్యుత్ కేంద్రంలో(ఏఈఈ) విధులు నిర్వహిస్తున్న ఇంజనీర్ ఎ.పవన్‌ప్రియ రాజ్, భార్య చంద్రిక మానవత్వం చాటుకున్నారు. తల్లిదండ్రులకు దూరంగా ఉండి చదువుకుంటున్న చిన్న పిల్లల గుర్తించి వారికి ఒక పూట అన్నం పెట్టి వారికి అవసరమైన బట్టలను అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా యుసిఐఎం చర్చ్ ఆధ్వర్యంలో హాస్టల్లో చదువుతున్న పేద గిరిజన విద్యార్థులకు భోజనాలు విద్యార్థులకు అందజేశారు అలాగే వారికి స్వీట్లు పంపిణీ చేసి ప్రస్తుతం చలికాలం కావడంతో విద్యార్థులు ఇబ్బందులు పడకుండా వారికి ఉన్ని దుస్తులను కూడా పంపిణీ చేపట్టారు. విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. వారితో కాసేపు సరదాగా గడిపారు ఈ కార్యక్రమంలో యుసిఐఎం చర్చ్ పాస్టర్ మనషే, వార్డెన్ సానీ పాల్గొన్నారు.

నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి రిఫ్రిజిరేటర్లు వితరణ

విశాలాంధ్ర - నర్సీపట్నం: నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి లయన్స్ క్లబ్, నవ్య లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మందుల నిల్వ చేసుకోవడానికి అవసరమైన రెండు రిఫ్రిజిరేటర్లు వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్ పర్సన్ గుడబండి ఆదిలక్ష్మీ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ చేస్తున్న సేవలను అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్, నవ్య లయన్స్ క్లబ్ నుంచి వెలగా నారాయణరావు, అధికారి గోపాలరావు, చెరుకూరి సత్యనారాయణ, వైద్యులు పాల్గొన్నారు.

6న లోక్ అదాలత్

విశాలాంధ్ర - అరకులోయ: మండలంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 6న లోక్ అదాలత్ శిబిరం నిర్వహిస్తున్నట్లు జాతీయ వినియెగదారుల ఉపాధ్యక్షులు సమర్థి రఘునాథ్ తెలిపారు. మండలంలోని పెద లబుదు, సి కోలనీ, కంట భవసుగుడ, శరభగుడ, జెడ్పి కోలనీ గ్రామాలను శుక్రవారం సందర్శించి లోక్ అదాలత్ నిర్వహణ అవశ్యకతలపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వపు ఉన్న సివిల్ కేస్ మీద ఎవరైనా ఉంటే ఈనెల 6వ తేదీన జరగబోయే లోక్ అదాలత్ శిబిరానికి రాతపూర్వకంగా వినతులను సమర్పించి పరిష్కార దిశను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పార లీగల్ వాలంటరీస్ శెట్టి సౌజన్య శోభ తో, పాటు కాంగ్రెస్ సీనియర్ నాయకులు శెట్టి భగత్ రాం వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు కిల్లో దొన్ను, తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణ ప్రతిఒక్కరి బాధ్యత

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు వడ్లపూడిలో శానిటేషన్ సిబ్బంది ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా ప్రజలకి దోమలు నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ బోండా జగన్నాథం (జగన్) మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు ఉండకుండా చూసుకోవాలని సూచించారు. ఓవర్ హెడ్ ట్యాంక్ ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ సెక్రటరీలు రమణ, వరలక్ష్మి, నీలిమ, భరత్, లలితకుమారి, సంధ్య, స్థానికులు క్రిష్ణ, రాజేష్, పైడిరాజు, సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

కూలికై వలస వెళ్లిన వ్యక్తి మృతి

విశాలాంధ్ర - రావికమతం: ఒడిశా రాష్ట్రంలో కూలి పనుల నిమిత్తం వలస వెళ్లిన వ్యక్తి మృతి చెందిన సంఘటన రావికమతం మండలం జడ్.కొత్తపట్నం గ్రామంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. మృతుని భార్య గాలి రాము ఆమె కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు తన భర్త గాలి రాజబాబు (52) గత కొన్ని రోజుల కిందట ఒడిస్సా రాష్ట్రానికి మరో కొంతమంది కూలీలతో పనుల నిమిత్తం వలస వెళ్లాడని గురువారం సాయంత్రం సహచర కూలిలతో కలప సేకరణ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు ఆ కర్రలు రాజబాబుపై పడి తీవ్రంగా గాయ పడ్డాడని వాపోయారు. గురువారం రాత్రి ఫోన్ చేసిన వ్యక్తులు రాజబాబుకు చిన్న చిన్న గాయాలు తగిలినట్టు చెప్పారని.. శుక్రవారం ఉదయం మరలా ఫోన్ చేసి నీ భర్త రాజబాబు మృతి చెందాడని అంబులెన్సు లో గ్రామానికి తీసుకు వస్తున్నట్టు తెలిపారని చెప్పింది. ఇలా పొంతన లేని సమాచారం ఇవ్వడంతో తన భర్త మృతిపై పలు అనుమానాలు ఉన్నాయని ఆమె పేర్కొంది. సంఘటన జరిగినప్పటి నుంచి కూలీలను పనుల కోసం తీసుకు వెళ్లిన మాకవరపాలెం మండలం తూటి పాల గ్రామానికి చెందిన కొల్లి అప్పలనాయుడు అనే కాంట్రాక్టర్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకొని పరారీ అయ్యాడని అక్కడ తన భర్తను ఏదో చేసి ఉంటారని మృతుని భార్య రాము రోధించింది. ఈ సంఘటనపై సమగ్ర దర్యాప్తు చేయాలని కోరుతూ కొత్తకోట పోలీసలకు ఫిర్యాదు చేసినట్టు ఆమె చెప్పింది.

అయ్యన్నపై అక్రమ కేసులు పెట్టి వేధించడం దుర్మార్గం

విశాలాంధ్ర - నర్సీపట్నం: రాష్ట్రంలో ఉన్న ప్రతిపక్షాలను అణిచివేసే చర్యల్లో భాగంగా వైసిపి ప్రభుత్వం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడిని అక్రమ కేసులు పెట్టి వారిని వేధించడం చాలా దుర్మార్గమని, దీన్ని ఖండిస్తున్నామని జనసేన నేతలు పేర్కొన్నారు. శుక్రవారం విశాఖపట్నం జనసేన పార్టీ నాయకులు పిఏసి సభ్యులు, గాజువాక ఇంచార్జ్ కోన తాతారావు, చోడవరం ఇంచార్జ్ పివిఎస్ఎన్.రాజు, విశాఖ నార్త్ ఇన్‌చార్జ్ పసుపులేటి ఉషాకిరణ్, భీమునిపట్నం ఇన్‌చార్జ్ సందీప్ పంచకర్లలు శుక్రవారం నర్సీపట్నంలోని అయ్యన్న స్వగృహంలో అయ్యన్నపాత్రుడును కలిసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పిఏసి చైర్మన్ నాదెండ్ల మనోహర్ ఫోన్ ద్వారా అయ్యన్నను పరామర్శించారు. భవిష్యత్తులో వైసీపీ ప్రభుత్వ దుర్మార్గ పరిపాలన ఎదుర్కొని ప్రజాస్వామ్యాన్ని రక్షించుకునే క్రమంలో ప్రతిపక్షాలు ఐక్య పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని జనసేన నేతలు అన్నారు.

పారిశుధ్య కార్యక్రమాలను సర్దుబాటు చేయండి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: పిన్ పాయింట్ వారిగా పారిశుధ్య కార్మికులను సర్దుబాటు చాయాలని జివిఎంసి కమిషనర్ పి. రాజా బాబు అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన జోన్-2, 8వ వార్డు పరిధిలోని మదురవాడ, మిధిలాపురి కోలనీ, హరిత ఉడా అపార్ట్మెంట్ తదితర ప్రాంతాలలో వార్డు కార్పొరేటర్ లోడగల అప్పారావుతో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పారిశుద్యం విషయంలో నిర్లక్ష్యం వహించకుండా పారిశుధ్య కార్మికులను సర్దుబాటు చేయాలని ప్రధాన వైద్యాదికారిని, అధికారులను ఆదేశించారు. ప్రతి ఇంటి నుండి తడి-పొడి చెత్త వేరు వేరుగా తీసుకోవాలని, క్లాప్ వాహనాలు నిర్ణీత సమయానికే విధులలో ఉండేలా చూడాలని, కాలువలు, రోడ్లు శుభ్రం చేసి ఆ వ్యర్థాలను డంపింగ్ యార్డుకు తరలించాలని ఆదేశించారు. వార్డులో మౌలిక వసతులైన త్రాగు నీరు, పారిశుద్యం, వీధి దీపాల నిర్వహణ తదితర అంశాలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వ్యర్థాలు పడే ప్రదేశాలను గుర్తించి, వ్యర్థాలు పడకుండా స్థానిక ప్రజలకు అవగాన కల్పించాలని, డస్ట్ బిన్లు ఉన్న ప్రదేశాల చుట్టూ శుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కెఎస్ఎల్జి శాస్త్రి, జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, ఎఎంఒహెచ్ డాక్టర్ కిషోర్, కార్యనిర్వాహక ఇంజినీరు మత్స్య రాజు, ఎసిపి శాస్త్రి, అసిస్టెంట్ కమిషనర్ వి. రమేష్, ఎపిడి గంగాధర్, శానిటరీ సూపర్వైజర్, శానిటరీ ఇన్స్పెక్టర్, కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.